పేదలకు సొంతిళ్లు.. సరికొత్త ఊళ్లు

- డివిజన్‌లో 302 లే అవుట్లలో పక్కా గృహాల నిర్మాణం
- మూడు నియోజకవర్గాల్లో 35,305 మందికి ఇళ్లు
- ఇప్పటికే పూర్తయిన గృహాలు 10,431
- వివిధ దశల్లో ఉన్న 22,939 ఇళ్లు



కొవ్వూరు మండలం కాపవరంలో నిర్మాణంలో ఉన్న, పూర్తయిన గృహాలు

కొవ్వూరు: అర్హులైన పేదలందరికీ సొంతిళ్లు సమకూర్చాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. ఇందుకోసం నవ రత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద కొవ్వూరు డివిజన్‌లో వేసిన జగనన్న లేఅవుట్లలో శరవేగంగా గృహ నిర్మాణాలు సాగుతున్నాయి. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.228.33 కోట్లను బిల్లుల రూపంలో చెల్లించింది. లబ్ధిదారుల కోసం లే అవుట్లలో తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు, డ్రెయిన్ల వంటి మౌలిక వసతులను సమకూరుస్తోంది. డివిజన్‌లోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో సొంత స్థలాలున్న వారితో కలిపి 36,305 మందికి ప్రభుత్వం గృహాలు మంజూరు చేసింది. వాటిలో ఇప్పటికే 10,431 గృహాల నిర్మాణం పూర్తయ్యింది. మరో 22,939 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. మరో 3,935 మంది లబ్ధిదారులు ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టలేదు. పీఎంఏవై, వైఎస్సార్ అర్బన్ పథకాల కింద రుడా పరిధిలో 32,143 మందికి, పీఏవై కింద 4,162 ఇళ్లను గ్రామీణ ప్రాంతాల వారికి మంజూరు చేశారు. ఒక్కో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తోంది. తక్కువ ఖర్చుకే ఐరన్, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిని ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఒక్కో లబ్ధిదారునికి ఇరవై టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నారు. లబ్ధిదారులు డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులైతే అదనంగా రూ.35 వేల రుణసాయం కూడా అందుతోంది.

302 చోట్ల కొత్త గ్రామాలు

కొవ్వూరు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో 776.39 ఎకరాల భూమిని సేకరించి 302 జగనన్న లే అవుట్లు వేశారు. నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్న ఈ లేఅవుట్లు ప్రస్తుతం కొత్త గ్రామాలను తలపిస్తున్నాయి. ఇప్పటికే కొవ్వూరు మండలంలోని కాపవరం జగనన్న కాలనీని సుందరంగా తీర్చిదిద్దారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఐదు లక్షల గృహాల్లో ఈ కాలనీ కూడా ఉంది. నియోజకవర్గాల వారీగా నిడదవోలులో 132 , గోపాలపురంలో 111, కొవ్వూరులో 59 జగనన్న లే అవుట్లు వేశారు.

మౌలిక వసతులకు రూ.కోట్లలో వ్యయం

రూ.9.37 కోట్ల వ్యయంతో డివిజన్‌లోని జగనన్న కాలనీల్లో రోడ్లు వేస్తున్నారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా 13, మునిసిపాలిటీల ద్వారా ఆరు, ఏపీఈపీడీసీఎల్ ద్వారా 16 పనులు చేపట్టారు.ఈ 35 పనుల్లో ఇప్పటికే 28 పూర్తయ్యాయి. మరో మూడు చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నాలుగు పనులను ప్రారంభించాల్సి ఉంది. రూ.1.74 కోట్ల వ్యయంతో డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో 2119 లే అవుట్లను విద్యుత్ సదుపాయం కల్పించి, వీధిలైట్లు వేశారు. తాగునీటి సరఫరా నిమిత్తం బోర్లకు రూ.34.66 లక్షలు, ఇళ్ల నిర్మాణంలో భాగంగా రాడ్ బెండింగ్ కోసం విద్యుత్తు సరఫరాకు ప్రభుత్వం 6.86 లక్షలు వెచ్చించింది. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఉచిత విద్యుత్తు సర్వీసుల కోసం రూ.93.07లక్షలు వెచ్చించింది. డివిజన్ వ్యాప్తంగా విద్యుత్తు శాఖ ద్వారా జగనన్న లేఅవుట్లలో రూ.30.9 కోట్ల విలువైన పనులు చేపట్టారు.

డిసెంబర్‌కు మరో ఇరవై వేల ఇళ్లు పూర్తి చేస్తాం



గృహ లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ నెలాఖరు నాటికి 19,600 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇందుకోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం.ఇప్పటికే జిల్లాలో 20 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశాం. లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకుకొచ్చి గృహ నిర్మాణాల వేగవంతానికి ప్రయత్నిస్తున్నాం.

– జి.పరశురామ్, జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి

రుడా పరిధిలో పీఎంఏవై, వైఎస్సార్ అర్బన్ పథకంలో ఇళ్లు..

నియోజకవర్గం	మొత్తం ఇళ్లు	పూర్తయిన ఇళ్లు	ఖర్చు రూ. కోట్లలో
గోపాలపురం	6,109	13	8.65
కొవ్వూరు	13,365	4549	101.23
నిడదవోలు	12,669	5556	106.82

పీఎంఏవై-ఎన్‌పీఏ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం

నియోజకవర్గం	మొత్తం ఇళ్లు	పూర్తయిన	ఖర్చు రూ.కోట్లలలో...
గోపాలపురం	3,436	242	9.93
కొవ్వూరు	550	58	1.27
నిడదవోలు	176	13	0.43

పెండ్లి కొడుకైన శ్రీవారు

- క్షేత్రంలో అట్టహాసంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- శ్రీ మహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారు



బుగ్గన చుక్కలతో స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేసే వేడుక శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. ముందుగా ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై తీసుకెళ్లి, మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై వేంచేపు చేశారు. అనంతరం సర్వాభరణ భూషితులైన శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు బుగ్గన చుక్క, కల్యాణ తిలకాలు దిద్దగా, ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను, పూలు, పండ్లను సమర్పించారు. ఆ తరువాత పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసే వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ఆఖరిలో అర్చకులు, పండితులకు ఈఓ దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. రాత్రి గజ వాహనంపై స్వామివారు ఉభయ దేవేరులతో క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. అలాగే ఆలయ ముఖ మండపంలో ఉభయ దేవేరులతో స్వామివారు శ్రీ మహా విష్ణు అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- రాత్రి ధ్వజారోహణ, వెండి శేషవాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు వేద పారాయణలు, సాంస్కృతిక కార్యక్రమాలు.
- ప్రత్యేక అలంకారం: ద్వారకా కృష్ణ అలంకారం

దుద్దుకూరులో రెండు తాటాకిళ్లు దగ్ధం

- రూ.12 లక్షల ఆస్తి బుగ్గి
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అంటున్న బాధితులు



దేవరపల్లి మండలం దుద్దుకూరులో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో మంగళవారం సాయంత్రం రెండు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాండ్రుకోట సోమరాజు, మంగిన సతీష్ అనే వారు దుద్దుకూరు–గౌరీపట్నం పుంతలో తాటాకిళ్లలో గత 30 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఇటీవల ప్రభుత్వం వారికి ఇళ్లస్థలాలు మంజూరు చేసి పట్టాలు కూడా జారీ చేసింది. కొత్తగా ఇచ్చిన స్థలాల్లో అధికారులు గృహాలు మంజూరు చేశారు. అగ్ని ప్రమాదంలో రెండిళ్లూ పూర్తిగా కాలిబూడిద కావడంతో సుమారు రూ.12 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ఇళ్లు కట్టుకోవడానికి జాగ్రత్త చేసుకున్న నగదుతో పాటు, ఇళ్లల్లోని విలువైన సామాన్లు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయినట్టు బాధితులు వివరించారు. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలలేదని తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని బాధితులు తెలిపారు. దుద్దుకూరు పంచాయతీ సర్పంచ్ బొంతా నాగమణి, సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, ఆర్‌ఐ డి.వెంకటేష్, బాధిత కటుంబాలను పరామర్శించారు. కొవ్వూరు అగ్నిమాపకదళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రెవెన్యూ అధికారులు నష్టం అంచనాలను నమోదు చేశారు. ఒక్కొక్క కటుంబానికి రూ.6 లక్షల చొప్పున నష్టం జరిగినట్టు ఆర్‌ఐ వెంకటేష్ తెలిపారు.

సినీనటుడు కృష్ణ విగ్రహం ఆవిష్కరణ



సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణ అల్లుడు సుధీర్‌బాబు

నల్లజర్ల: మహేష్ బాబు ఫ్యాన్స్ మండలంలోని ప్రకాశరావుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సినీ నటుడు, సూపర్ స్టార్ కృష్ణ నిలువెత్తు విగ్రహాన్ని సోమవారం రాత్రి ఆయన అల్లుడు, సినీ నటుడు పోసాని సుధీర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ కృష్ణ కుటుంబ సభ్యుల కంటే మిన్నగా అభిమానులే ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 'అగ్ని పర్వతం' చిత్రంలోని గెటప్‌లో కృష్ణ విగ్రహాన్ని ఈ గ్రామంలో ఏర్పాటు చేయడం విశేషమన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి రావడంలో కృష్ణ కృషి ఎంతైనా ఉందన్నారు. ఆయన ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళదామన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి ప్రసాద్, ముత్తిన నరేష్, ఎంపీటీసీ నేకూరి రాజేష్, కరుటూరి లక్ష్మీగణేశ్వరావు, విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మహేష్‌బాబు ఫ్యాన్స్ శెట్టి కృష్ణ, నేకూరి చందు, కృష్ణ అభిమాన సంఘ అధ్యక్షుడు సింగం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ జగన్ రావాలి, కావాలంటున్నారు



సీహెచ్ పోతేపల్లిలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని పెన్షన్‌దారుడూ మళ్లీ జగన్ రావాలి.. జగన్ కావాలంటున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని సీహెచ్.పోతేపల్లి, కోడిగూడెం గ్రామాల్లో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో విశ్వరూప్‌తో పాటు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు, రాజమహేంద్రవరం ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్‌రామ్, ఏలూరు జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సీహెచ్.పోతేపల్లిలో నిర్మించిన సచివాలయం, ఎస్సీ కమ్యూనిటీ హాలు భవనాలను, కోడిగూడెంలో పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అంతక ముందు సీహెచ్.పోతేపల్లిలో జరిగిన సభలో పలువురు లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు విజ్ఞప్తి మేరకు గిరమ్మ ఎత్తిపోతల పథకానికి తన నిధుల నుంచి రూ. 40 లక్షలు, ఎంపీ మార్గాని భరత్ రామ్ నిధుల నుంచి మరో రూ.40 లక్షలు కేటాయిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ఈ సందర్భంగా అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ లేకుండానే కదిలిన బస్సు



సాంకేతిక లోపంతో ముందుకు కదిలిన బస్సు

నిడదవోలు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం డ్రైవర్ లేకుండానే బస్సు ముందుకు దూసుకుపోయింది. ఆ సమయంలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిడదవోలు డిపోకు చెందిన బస్సు నరసాపురం నుంచి ఉదయం 11.10 గంటలకు ప్రయాణికులతో డిపోకు చేరుకుంది. బస్సులో ఉన్న ప్రయాణికులందరూ దిగి వెళ్లిపోయారు. డ్రైవర్ బస్సు హ్యాండ్ బ్రేక్ వేసి డిపో కార్యాలయానికి వెళ్లాడు. ఇంతలో ఒక్కసారిగా బస్సు హ్యాండ్ బ్రేక్ ఫెయిలై బస్సు ముందుకు దూసుకు వెళ్లి బడ్డీ కొట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్ స్పందించి బస్సుకు మరమ్మతులు చేయించారు.

అమ్మవారికి బంగారు సూత్రాల సమర్పణ

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరంలో కొలువైన అన్నపూర్ణా సమేత విజయ లింగేశ్వరస్వామివారి ఆలయంలోని అమ్మవారికి రాజానగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరానికి చెందిన దాతలు గట్టి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, వరలక్ష్మి దంపతులు రూ.25,200 విలువైన 4.510 గ్రాముల బంగారు సూత్రాలను సోమవారం సమర్పించారు. దాతాలు వాటిని ఆలయ ఈఓ నామా సూర్యప్రకాశరావుకు అందించారు. కార్యక్రమంలో మద్దంశెట్టి శ్రీనివాస్, రాము, రాజ్యలక్ష్మి, గుండాబత్తుల నాగమణి, నాని, ఆలయ అర్చకుడు కాశీ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పోలియో దినోత్సవం



చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నిడదవోలు: ప్రపంచ పోలియో దినోత్సవాన్ని మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కొండపాడుకు చెందిన ఉదయగిరి గాంధీ ఆర్థిక సహాయంతో చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అమలు చేస్తున్న రోటరీ ఫౌండేషన్ వంటి సంస్థల కృషితో పోలియో వ్యాధిని అరికట్టారన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాస్, రోటరీ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, తాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగజ్జనని.. వర ప్రదాయిని

- మహిషాసుర మర్దినిగా, రాజరాజేశ్వరిగా అమ్మవారు
- శమీ పూజలు, జగన్మాత రథోత్సవాలు
- ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు



నిడదవోలు 27వ వార్డులోని కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే శరన్నవరాత్ర ఉత్సవాలు విజయదశమి పర్వదినంతో ఘనంగా ముగిశాయి. శక్తి స్వరూపిణి, జగన్మాత తొమ్మిది రోజుల పాటు రోజుకొక రూపంలో భక్తుల పూజలందుకున్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని సోమ, మంగళవారాల్లో వేలాది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 324 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలు, చండీ పారాయణ, హోమాలు నిర్వహించారు. దాతల ఆర్థిక సహాయంతో చక్కెర పొంగలి, దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు పులిహోర ప్రసాద వితరణ చేశారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.20,65,072 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం చెప్పారు. అలాగే మండలంలోని కంసాలిపాలెంలోని దేవీపాటిమ్మ వారిని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు దర్శించి పూజలు చేశారు.

నిడదవోలు: స్థానిక 27వ వార్డులోని కనకదుర్గమ్మ వారిని, 4వ వార్డు కుమ్మర వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు దర్శించుకుని పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఉండ్రాజవరం: వివిధ గ్రామాల్లో కొలువైన అమ్మవార్లను సోమవారం మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. ఉండ్రాజవరంలో బ్రహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలోను, వేలివెన్ను, మోర్త, పాలంగి, సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాల్లో ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలోను శమీ వృక్షానికి శమీ వృక్ష దేవతా పూజ నిర్వహించారు. భక్తులకు పులిహోర, బూరెలు ప్రసాదంగా పంపిణీ చేశారు.

ఇరుముడులతో భవానీల ఊరేగింపు



ఇరుముడులతో అన్నవరప్పాడులో భవానీల ఊరేగింపు

పెరవలి: దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం మండలంలోని కానూరు, ముక్కామల, పెరవలి, తీపర్రు, కాకరపర్రు, అన్నవరప్పాడు గ్రామాల్లోని అమ్మవారి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీల్లోను, పూల మండపాల్లోనూ ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. ఖండవల్లిలోని కనకదుర్గమ్మ వారి ఊరేగింపు అట్టహాసంగా సాగింది. కాగా అన్నవరప్పాడులో భవానీలు ఇరుముడులతో ఊరేగింపుగా విజయవాడ దుర్గామాత దర్శనానికి బయలు దేరారు.



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ వారు

చాగల్లు: చాగల్లు మాతంగి చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ వారిని విజయ దశమి సందర్భంగా సుందరంగా అలంకరించారు. ఇక్కడ నిర్వహించిన కుంకుమ పూజల్లో సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొనడం విశేషం. అమ్మవారిని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.



చాగల్లులో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న ఎంపీ మార్గాని భరత్

వైభవంగా అమ్మవారి రథోత్సవం

తాళ్లపూడి: స్థానిక నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మను చివరి రోజు రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి రథయాత్రను వైభవంగా నిర్వంచారు. మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. వాహనాలకు పూజలు చేశారు.

నల్లజర్ల: చీపురుగూడెం –తిమ్మన్నపాలెం గ్రామాల మధ్య గల కనకదుర్గమ్మ వారు సోమవారం రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వంట్ల పెద రామన్న దంపతుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం శమీ పూజ జరిగింది. అనంతపల్లి స్వర్ణ దుర్గాశ్రమంలో మంగళవారం రాజవరానికి చెందిన దాసరి సూర్యవెంకటేశ్వరరావు పద్మినీదేవి, దాసరి నారాయణరావు, గంగారత్నం ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన జరిగింది. త్యాజంపూడి రామభక్త హనుమాన్ భజనబృందం ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన జరిగింది.

వైభవంగా బతుకమ్మ వేడుకలు

దేవరపల్లి: మండలంలో దసరా ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులు దుర్గాదేవిని తొమ్మిది అవతారాల్లో అలంకరించిన భక్తులు కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారి ఆలయం వద్ద సోమవారం రాత్రి బతుకమ్మలను తయారు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఐదేళ్లుగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బందపురంలో కోదండ రామాలమం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవిని గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

క్లుప్తంగా

నేడు మంత్రులు వనిత, అంబటి పర్యటన

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం ఉదయం 11.15 గంటలకు జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారు.11.30 గంటలకు అదే గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తారు.1.45 గంటలకు పెద్దేవం జెడ్పీ హైస్కూలు ఆవరణలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొంటారు. సాయంత్రం 3.30 గంటల నుంచి చాగల్లులో ఐదో సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వనిత పాల్గొంటారు.

సాయికోటి మూల నిధికి రూ.5.22 లక్షల విరాళం



సాయి కోటి మూలనిధికి విరాళం అందజేస్తున్న దాతలు శ్రీనివాసరావు దంపతులు

గోపాలపురం: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయి కోటి మూలనిధికి దాత సత్తి శ్రీనివాసరావు, భాస్కర నాగమణి దంపతులు సోమవారం రూ 5,21, 811లు విరాళంగా అందజేశారు. శరన్నవరాత్రులు, సాయిబాబా మహా సమాధి చెందిన పర్వదినం సందర్భంగా సోమవారం ఆలయం వద్ద అన్న సమారాధన చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి పోతుల అప్పిరెడ్డి, కమిటీ సభ్యులు టీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న దూబచర్ల గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ మంగళవారం ఆర్థిక సాయం చేసింది. వైఎస్సార్ వసంత్ నగర్ కాలనీలో పగటి వేషాలు వేసుకుని జీవించే మోతే వెంకటేశ్వరరావు, గాంధీ కాలనీకి చెందిన కొక్కిరపాటి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ చెరో రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, దావులూరి చిరంజీవి, గుండు త్రినాథరావు, అప్పసాని రామకృష్ణ, మానూరి ఆదినారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సతీష్

తాళ్లపూడి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని గజ్జరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గొంతి సతీష్ నియమితులయ్యారు. గతంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆయన పనిచేశారు. తనను ఈ పదవిలో నియమించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్, జిల్లా అధ్యక్షుడు కవల వెంకటరావులకు ఈ సందర్భంగా సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

అనంతపల్లిలో ఉచిత భిక్ష ప్రారంభం



అనంతపల్లిలో భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి గ్రామంలోని అయ్యప్ప దీక్షా మందిరంలో అయ్యప్ప దీక్షాధారులకు ఉచిత భిక్ష సోమవారం నుంచి ప్రారంభమైంది. దాతల సహకారంతో డిసెంబరు 5 వరకూ 42 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ప్రత్తి శ్రీనుబాబు తెలిపారు. రోజుకు 150 మంది వరకూ స్వాములకు ఇక్కడ భిక్ష ఏర్పాటు చేస్తారు. పరిసర గ్రామాల స్వాములతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే దీక్షాధారులు ఇక్కడ భిక్ష స్వీకరిస్తుంటారని కమిటీ సభ్యులు బళ్ల నాని, చిక్కాల నాగేశ్వరరావు, గురుస్వామి దివి పాండురంగ శర్మ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. దాతల తోడ్పాటుతో దాదాపు రూ.20 లక్షల వ్యయంతో భోజనశాల, వంట గది ఏర్పాటు చేశారు.

ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ వెల్ఫేర్ సంఘ నూతన కార్యవర్గం

తాళ్లపూడి: మండల ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా ఎలుబోలు వీరరాఘవేంద్రరావు, అధ్యక్షుడిగా ఎలుబోలు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బట్టు నాగరాజు, కార్యదర్శిగా గుమ్మడి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా బొట్టా భాస్కరరావు, కోశాధికారిగా శలబోయిన శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. సలహాదారులుగా బ్రమిడల భీమరాజు, బందారు గోపిలను ఎన్నుకున్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
నిడదవోలు మెయిన్ బ్రాంచి, తూ.గో.జిల్లా
ఇ-వేలం వాయిదా ప్రకటన
తేది.23.09.2023న "సాక్షి దినపత్రిక, నిడదవోలు డివిజన్, తూర్పు గోదావరి జిల్లాలో ప్రచురించబడిన ఆస్తి ఇ-వేలంకు సంబంధించిన "ఋణగ్రహీత : మెస్సర్స్ శ్రీ బాలాజీ ఏజెన్సీస్, ప్రొ.శ్రీ దొంతర వెంకట రామకృష్ణ రాజేంద్ర వరప్రసాద్, తండ్రి : సూర్యనారాయణ మూర్తి, హామీదారు : శ్రీమతి దొంతర విజయ ప్రభ, భర్త : శ్రీ దొంతర వెంకట రామకృష్ణ రాజేంద్ర వర ప్రసాద్, గారికి చెందిన స్థిరాస్తి ఇ-వేలం తేది.25-10-2023 న జరుగవలసి, వాయిదా పడిన ఇ-వేలం తేదీ 10-11-2023 నే జరుపబడునని తెలియపరుస్తున్నాము. నియమ నిబంధనలు మరియు సమయములు ఇంతకు పూర్వము నోటీసులో తెలిపిన ప్రకారం వేలం జరుపబడును. మరిన్ని వివరములకు సంప్రదించండి: 91002 97031, 99516 85300, 99129 54666, 94936 92262
తేది : 24.10.2023   సం/- అధీకృత అధికారి